సాక్షి వనపర్తి
బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



అటకెక్కిన బైపాస్..
దినదినాభివృద్ధి చెందుతున్న జడ్చర్లలో బైపాస్ రోడ్డు ప్రతిపాదనలు అటకెక్కాయి.
వివరాలు 8లో ▸



4 యూనిట్లలో విద్యుదుత్పత్తి
జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది.
వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.2 /23.4

వాతావరణం
ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

సమ్మె సంకటం..!

ఆందోళన బాటపట్టిన అంగన్‌వాడీల నిర్వాహకులు

- కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి అధికారులు
- కేంద్రాల తాళాలు తొలగిస్తున్న వైనం
- ప్రైవేటు భవనాల యజమానులతో వాగ్వాదాలు



మదనాపురంలో అంగన్‌వాడీ కేంద్రానికి వేసిన తాళం పగులగొడుతున్న అధికారులు

అమరచింత: హక్కుల సాధన కోసం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం నుంచి ఆందోళన బాట పట్టడంతో కేంద్రాలు మూతబడ్డాయి. దీంతో మంగళవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికలు, చిన్నారులకు సత్వరమే పౌష్టికాహారం అందించాలని.. ఐసీడీఎస్ అధికారులు, ఎంపీడీఓలు, రెవెన్యూ అధికారులు గ్రామాల్లోని కేంద్రాల తాళాలు తొలగించి సరుకులు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల తాళాలు పగులగొట్టే ప్రయత్నం చేయగా యజమానులు అధికారులతో వాగ్వాదానికి దిగడంతో అక్కడి నుంచి నిష్క్రమించారు. తాళాలు పగులగొట్టిన కేంద్రాల్లోని సరుకులను లబ్ధిదారుల వివరాలు తెలుసుకొని పౌష్టికాహారం అందించే బాధ్యతను ఆయా గ్రామాల బీఎల్వోలు, బుక్ కీపర్లు, ఆర్పీలకు అప్పగించారు. సమస్యల పరిష్కారం కోసం మూడురోజుల పాటు శాంతియుతంగా సమ్మె చేయాలని నిర్ణయించామని.. ప్రభుత్వం తమ మనోభావాలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందని అంగన్‌వాడీ టీచర్లు ఆరోపిస్తున్నారు. కేవలం తాళాలు తొలగించడం కాదని.. కేంద్రాలకు వచ్చే వారికి పౌష్టికాహారం అందించడంతో పాటు చిన్నారులను రోజంతా కూర్చోబెట్టి చదువు చెప్పాలని కోరుతున్నారు.

గ్రామాల్లో వాగ్వాదం..

అంగన్‌వాడీ కేంద్రాలకు వేసిన తాళాలు పగులగొట్టి తెరిచేందుకు వెళ్లిన అధికారులకు అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఇంటి యాజమానులకు మాటామాట పెరిగి ఘర్షణ వాతావరణానికి దారితీసింది. తాళాలు తీసుకొచ్చి తెరవాలని.. పగులగొడితే ఒప్పుకోమని చెప్పడంతో అధికారులు చేసేదేమీ లేక తిరిగి వెళ్లిపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

హక్కులు కాలరాయడమే..



మా సమస్యలు పరిష్కరించాలంటూ శాంతియుతంగా సమ్మె చేస్తున్నాం. కాని ప్రభుత్వం హక్కులను కాలరాయడానికి యత్నిస్తోంది. కేంద్రాల తాళాలు పగులగొట్టడం సమంజసం కాదు. ఉద్యమంపై నీళ్ల చల్లే ప్రయత్నాలకు పాల్పడుతున్నారని.. తమ హక్కుల సాధన కోసం సమ్మె కొనసాగిస్తాం.

– రాధ, జిల్లా ప్రధానకార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్ల సంఘం, పెబ్బేరు

జిల్లాలో తెరుచుకున్న 200 కేంద్రాలు..



అమరచింత ఒకటో అంగన్‌వాడీ కేంద్రం వద్ద అధికారులతో వాగ్వాదానికి దిగిన ఇంటి యజమాని

జిల్లాలోని 14 మండలాల్లో 589 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. మంగళవారం 200 కేంద్రాలను తెరిచి నిర్వహణ బాధ్యతను ఆర్పీలు, బుక్‌కీపర్లకు అప్పగించారు. సీడీపీఓలతో పాటు సూపర్‌వైజర్లు ఎంపీడీఓలు, తహసీల్దార్ కార్యాలయ ఆర్ఐలను వెంటబెట్టుకొని గ్రామాల్లోని కేంద్రాలు తెరిచేందుకు ఇబ్బందులు ఎదురైనా.. ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తున్నారు. ఆత్మకూర్ ప్రాజెక్టు పరిధిలో 25, పెబ్బేరు ప్రాజెక్టు పరిధిలో 88, వనపర్తి ప్రాజెక్టు పరిధిలోని 87 కేంద్రాలను అధికారులు మంగళవారం తెరిపించారు.

అధికారుల ఆదేశాల మేరకు..



జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచాం. ఎంపీడీఓ, ఆర్ఐ, మున్సిపల్ అధికారుల సహకారంతో మంగళవారం సాయంత్రం వరకు ప్రాజెక్టు పరిధిలోని 25 కేంద్రాలు తెరిచాం. లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– భారతి, సీడీపీఓ, ఆత్మకూర్

న్యూస్‌రీల్

టెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి : డీఈఓ

వనపర్తిటౌన్: జిల్లాలో ఈ నెల 15న టెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్‌చార్జ్ డీఈఓ నరహరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7,186 మంది, మధ్యాహ్నం 5,547 మంది మొత్తం 12,733 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని వెల్లడించారు. మొబైల్ ఫోన్లు, గడియారాలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతించమని పేర్కొన్నారు. హాల్‌టికెట్‌పై ఫొటో లేకపోతే అతికించి గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి తీసుకురావాలని సూచించారు.

మట్టి ప్రతిమలు ప్రతిష్టిద్దాం



కొత్తకోట: మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుదామని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ చేపట్టే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. తనవంతుగా 10 వేల మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయించి మంగళవారం పట్టణ ప్రజలకు పంపిణీ చేసి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు సహజ రంగులు వాడాలని, కాలుష్యం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మున్సిపాల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని, వైస్ చైర్‌పర్సన్ జయమ్మ, ఎంపీపీ గుంత మౌనిక, చెన్నకేశవరెడ్డి, విశ్వేశ్వర్, ఆకుల శ్రీను, గాడీల ప్రశాంత్, బాబురెడ్డి, కె.శ్రీనివాస్‌జీ, సుభాష్, వినోద్ సాగర్, కో–ఆప్షన్ సభ్యులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు వైద్య శిబిరాలు



వనపర్తిటౌన్: వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని.. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని నాగవరంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర ఏ, బి వసతి గృహాల్లో కడుకుంట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి రశ్మితరెడ్డి విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశానుసారం వసతిగృహాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించి వాటి బారిన పడకుండా వార్డెన్లు చూసుకోవాలని ఆదేశించారు. భోజనానికి ముందు, మల విసర్జన అనంతరం సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. నిల్వ నీటిని ఎప్పటికప్పుడు పారబోయాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారులు ఎస్.ఆంజనేయులు, ఎస్.రమేష్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

మదనాపురం: రైల్వే పనుల కోసం కాంట్రాక్టర్ మంగళవారం టిప్పర్లు, హిటాచీతో మండలంలోని ఎర్రగట్టు నుంచి ఎర్రమట్టిని తరలించేందుకు యత్నించగా.. తిర్మలాయపల్లి, అజ్జకొల్లు రైతులు, గ్రామస్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అడ్డుకున్నారు. తమకు అన్ని అనుమతులు ఉన్నాయని.. కచ్చితంగా మట్టి తీసుకెళ్తామని సిబ్బంది చెప్పడంతో ప్రజలు ఆగ్రహానికి లోనయ్యారు. ఎట్టి పరిస్థితుల్లో పిడికెడు మట్టిని కూడా తీసుకెళ్లనివ్వమని పట్టుబట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని హిటాచి, టిప్పర్లను తిప్పి పంపించారు.

టీఎస్‌సీఎస్‌టీయూఎస్ అధ్యక్షుడిగా రాంసింగ్

వనపర్తిటౌన్: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం (టీఎస్‌సీఎస్‌టీయూఎస్) జిల్లా అధ్యక్షుడిగా సబావట్ రాంసింగ్, ప్రధానకార్యదర్శిగా నాగేశ్వర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్‌నాయక్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రతినిధులు తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేస్తామని, సంఘం అభివృద్ధే లక్ష్యంగా, ఉపాధ్యాయుల బలోపేతం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

విద్యాహబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: జిల్లాను రాష్ట్రంలోనే అతిపెద్ద మూడో **విద్యాహబ్‌గా తీర్చి**దిద్దాలనే లక్ష్యంతో పని చేస్తు**న్నట్లు రాష్ట్ర వ్యవసా**యశాఖ మంత్రి సింగిరెడ్డి నిర**ంజన్‌రెడ్డి తెలిపారు.** మంగళవారం రాత్రి జిల్లాకేంద్రంలోని లక్ష్మీకృష్ణ గార్డెన్స్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని విద్యా కోర్సులున్న జిల్లాలుగా హైదరాబాద్, వరంగల్ తర్వాత వనపర్తి జిల్లా పేరును చూడాలనే తపనతో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్, ప్రభుత్వ వైద్య కళాశాల, అగ్రికల్చర్ డిగ్రీ కాలేజ్, ఫిషరీస్ కళాశాలను మంజూరు చేయించినట్లు వివరించారు. భవిష్యత్ తరాలకు అన్నిరకాల విద్యను అందుబాటులోకి తీసుకొస్తే.. అభివృద్ధికి బాటలు వేసినట్లేననే భావనతో జిల్లాలో లేని కోర్సు ఏదీ ఉండొద్దనే తపనతో పని చేస్తున్నట్లు తెలిపారు. క్యాబినెట్ వ్యతిరేకించినా ఇంజినీరింగ్, వ్యవసాయ డిగ్రీ కళాశాలను తీసుకొచ్చినట్లు వివరించారు. భవిష్యత్‌లో వెటర్నరీ, న్యాయ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు.

త్వరలో మంత్రి కేటీఆర్ రాక..

జిల్లాకేంద్రంలో నిర్మించిన టౌన్‌హాల్, సమీకృత మార్కెట్‌యార్డు, జిల్లా గ్రంథాలయ భవనాల ప్రారంభోత్సవంతో పాటు ఐటీ టవర్, గౌరిదేవిపల్లి వద్ద తాగునీటి సరఫరా యూనిట్ నిర్మాణం, పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ త్వరలో రానున్నట్లు మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగూరు ప్రమోద్‌కుమార్‌రెడ్డి, పట్టణ ఇన్‌చార్జ్ అరుణ్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రుణ వసూళ్లపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: రుణాలు తీసుకున్న స్వయం సహాయక సంఘాల మహిళలు సక్రమంగా తిరిగి చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బ్యాంకు లింకేజీ రుణాలు తక్కువగా పొందుతున్న పాన్‌గల్, పెద్దమందడి, వీపనగండ్ల, పెబ్బేరు, గోపాల్‌పేట మండలాల సెర్ప్ ఉద్యోగులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొండి బకాయిలు వసూలు చేసి వారం రోజుల్లో సగానికి తగ్గించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు కొత్త ఆలోచనలతో ఉపాధి పొందే అంశాలపై దృష్టిసారించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా స్వీప్ యాక్టివిటీపై మహిళా సంఘాల సభ్యుకు అవగాహన కల్పించాలన్నారు. స్వీప్ యాక్టివిటీలో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయాలని కోరారు.

■ ఈ నెల 16న సీఎం కేసీఆర్ పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించనున్నారని.. కొల్లాపూర్‌లో జరిగే సమావేశానికి మహిళా సంఘాల సభ్యులు, రైతులు అధికసంఖ్యలో హాజరయ్యేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ కోరారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, రవాణా, భోజన వసతి కల్పించాలని ఎంపీడీఓలకు సూచించారు. సమావేశంలో డీఆర్డీఓ నర్సింహులు, డీపీఓ సురేష్, పుర కమిషనర్ విక్రమసింహారెడ్డి, ఎంపీడీఓలు, సీసీలు, సెర్ప్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

'టెట్'ను నిర్లక్ష్యం చేయొద్దు..

టెట్ నిర్వహణలో అధికారులు ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సెంటర్ ఇన్‌చార్జ్‌లు, సూపర్‌వైజర్లు, జిల్లా అధికారుల శిక్షణ శిబిరంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రెండువిడతల్లో పరీక్ష కొనసాగుతుందని.. ఉదయం పరీక్షకు 30 కేంద్రాలు, మధ్యాహ్నం పరీక్షకు 25 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేదని.. పరీక్షకు హాజరయ్యే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సెల్‌ఫోన్లు, చేతి గడియారాలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతించరాదని.. సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకున్న వారికి మాత్రమే పరీక్ష రాసే అవకాశం ఉంటుందని వివరించారు. కేంద్రాల వద్ద బందోబస్తుకు పోలీస్‌శాఖకు ఆదేశాలు ఇచ్చామని.. సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. ఓఎంఆర్ షీట్లు అభ్యర్థులకు మాత్రమే అందించాలని, కోడ్‌నంబర్ జాగ్రత్తగా పరిశీలించాలని, సీటింగ్ ప్లాన్ పరీక్ష కేంద్రం వెలుపల ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు. పరీక్ష పూర్తయిన తర్వాత క్లోజ్డ్ వెహికల్స్‌లో ఓఎంఆర్ షీట్లను తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

మహిళల అభ్యున్నతికి సమష్టి కృషి



జూట్ బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి

- జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి

వనపర్తి: మహిళలు, రైతుల అభ్యున్నతే దేశాభివృద్ధిగా భావించాలని జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించిన జిల్లా ఏడో సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణాభివృద్ధినే అసలైన పురోగతిగా భావించాలని మహాత్మాగాంధీ చెప్పిన మాటలను గుర్తుచేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అద్భుతమైన వృద్ధి సాధిస్తున్నామని.. మహిళా సంఘాల సభ్యులు, యువత ఆయా రంగాల వైపు దృష్టి సారించాలని సూచించారు. మహిళల అభ్యున్నతికి సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన జూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు.

వేధింపులకు గురిచేస్తే చర్యలు

ఖిల్లాఘనపురం: ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, అమ్మాయిలను వేధించడం, సెల్‌ఫోన్‌లలో అసభ్యకర సందేశాలు పంపి ఇబ్బందులకు గురిచేయడంలాంటి పనులు చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా షీటీం ఇన్‌చార్జ్ డబ్ల్యూఎస్‌ఐ ఇందిర హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని తెలుగు, ఇంగ్లీష్ మీడియం కేజీబీవీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కళాశాలలు, పాఠశాలలు, బస్టాండు తదితర ప్రాంతాల్లో ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే డయల్ 100కు గాని సెల్ నంబర్ 63039 23211 సమాచారం ఇవ్వాలని సూచించారు. తల్లిదండ్రుల ద్వారా విద్యార్థులు ధైర్యంగా తెలియజేయాలన్నారు. విద్యార్థులు నేడు సోషల్ మీడియాకు అలవాటుపడి చదువులో వెనుకబడుతున్నారని.. అలాంటివి పక్కకుబెట్టి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రత్యేక అధికారులు లలిత, ప్రశాంతి, పోలీసులు శ్రీనివాసులు, కృష్ణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని మార్కెట్‌యార్డ్ వద్ద మంగళవారం జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి బి.రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్మిక చట్టాలు, సైబర్ నేరాలు, ఇన్సూరెన్స్, సఖికేంద్రం సేవలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రావిడెంట్ ఫండ్ ప్రయోజనాలను వివరించారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు డి.కృష్ణయ్య పాల్గొన్నారు.

చోటు.. ఎవరికి చేటు!

కాంగ్రెస్‌లోకి వలసలు

ఇప్పటికే చేరిన మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి

- అదే దారిలో గట్టు భీముడు కుటుంబం, బీకేఆర్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి
- హస్తంలో చేరనున్నట్లు యెన్నం సంకేతాలు
- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో భేటీ, 17న సోనియా సమక్షంలో చేరిక
- పాలమూరులో మారుతున్న రాజకీయ సమీకరణాలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి పాలమూరులో రాజకీయ పరిణామాలు రోజురోజుకు వేగంగా మారుతున్నాయి. బీఆర్‌ఎస్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే సీట్లు ఖరారు కాగా.. ఆ పార్టీ నేతలు ప్రతిరోజు ఏదో చోట పర్యటిస్తూనే ఉన్నారు. అభివృద్ధి, సంక్షేమ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూనే పార్టీలో చేరికలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి తనయుడు రాజేష్‌రెడ్డి, పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి ఎపిసోడ్ తర్వాత కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్‌లోకి మళ్లీ వలసలు జోరందుకున్నాయి. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి సోమవారం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా మంగళవారం గద్వాల మాజీ ఎమ్మెల్యే దివంగత గట్టు భీముడి కుటుంబం, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి రేవంత్‌రెడ్డి సమక్షంలో 'చేయి' అందుకున్నారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ నెల 17న కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ సమక్షంలో ఆయన హస్తం కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. ఇలా సీనియర్ నేతలు కాంగ్రెస్ వైపు చూస్తుండడంతో పార్టీలో జోష్ నెలకొనగా.. భవిష్యత్ పరిణామాలపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

■ గద్వాలలో మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా.. ఆయనకు ఆ వర్గాల్లో మంచి పట్టు ఉంది. నియోజకవర్గంలో తొలి బీసీ ఎమ్మెల్యే ఈయనే. 2011లో బీఆర్‌ఎస్‌లో చేరిన గట్టు భీముడికి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినప్పటికీ ఆ పదవి దక్కకుండానే 2019లో ఆయన కన్నుమూశారు. అప్పటి నుంచి ఆయన కుటుంబసభ్యులు పార్టీతో పాటు, స్థానిక ఎమ్మెల్యే వైఖరిపై అసంతృప్తిగా ఉంటున్నారు. మంగళవారం గట్టు భీముడి భార్య భువనేశ్వరి, గట్టు జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచ్ బాసు హనుమంతు, గట్టు భీముడి చిన్న సోదరుడు తిమ్మప్ప తదితరులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలవడంతో గద్వాల రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారితీస్తోంది. ఇప్పటికే బీసీ సామాజిక వర్గానికి చెందిన జెడ్పీ చైర్‌పర్సన్ సరిత బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం, తాజాగా బీసీ సామాజికవర్గంలో అత్యధిక ఓటుబ్యాంకు ఉన్న బోయ కులానికి చెందిన గట్టు భీముడి కుటుంబం సైతం హస్తం గూటికి చేరడంతో అధికార పార్టీకి ఎదురుదెబ్బగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

■ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఒకప్పుడు సీత, ఆమె భర్త దయాకర్‌రెడ్డి క్రియాశీలక పాత్ర పోషించారు. 2009 ఎన్నికల్లో టీడీపీ నుంచి మక్తల్ ఎమ్మెల్యేగా దయాకర్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యేగా సీతమ్మ గెలుపొంది సంచలనం సృష్టించారు. అంతకుముందు ఆమె జెడ్పీ చైర్‌పర్సన్‌గా కూడా పనిచేశారు. దయాకర్‌రెడ్డి మరణించక ముందు కొంతకాలం క్రితమే టీడీపీకి రాజీనామా చేశారు. త్వరలో ఏ పార్టీలో చేరనున్నది స్పష్టం చేస్తామని పేర్కొన్న ఆయన ఇంతలోనే అనారోగ్యకారణంతో కన్నుమూశారు. తాజాగా ఆయన భార్య సీతాదయాకర్‌రెడ్డి కార్యకర్తలు, అనుచరుల అభిప్రాయం మేరకు కాంగ్రెస్‌లో చేరారు. మరోవైపు బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మక్తల్ నియోజకవర్గానికి చెందిన ఆయన సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ కొన్నాళ్లుగా ప్రజలకు దగ్గరయ్యారు.

■ బీజేపీ నుంచి సస్పెన్షన్ వేటుకు గురైన మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరనున్నట్టు సంకేతాలు ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన క్రియాశీలకంగా పనిచేశారు. 2012 మహబూబ్‌నగర్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీచేసి గెలుపొందారు. 2014 ఎన్నికల్లో ఓటమి తర్వాత 2015లో బీజేపీని సైతం వీడి డాక్టర్ చెరుకు సుధాకర్‌తో కలిసి తెలంగాణ ఇంటిపార్టీని స్థాపించారు. 2018 ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన ఆయన మహబూబ్‌నగర్ టికెట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. మళ్లీ బీజేపీలో చేరిన ఆయన ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల క్రమంలో కాంగ్రెస్‌లోకి చేరేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు.

కొత్త, పాత నేతల మధ్య వైరం

మహబూబ్‌నగర్ అసెంబ్లీ టికెట్ కోసం కాంగ్రెస్ నుంచి టీపీసీసీ కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్‌తో పాటు ఇటీవల బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన బీసీ సామాజికవర్గానికి చెందిన ఎంపీ వెంకటేశ్ సైతం పోటీపడుతున్నారు. ఇదే స్థానం నుంచి ఇప్పుడు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సైతం బరిలో ఉంటున్నారు. అదేవిధంగా మక్తల్‌లో ఇప్పటికే నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్, ఆప్కాబ్ మాజీ చైర్మన్, దివంగత వీరారెడ్డి తనయుడు ప్రశాంత్‌రెడ్డి, ఎన్నారై పోలీస్ చంద్రశేఖర్ రెడ్డితో పాటు తాజాగా కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, డీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. మక్తల్ సాధ్యంకాని పక్షంలో దేవరకద్రలో సైతం పోటీ చేసేందుకు సీతాదయాకర్‌రెడ్డి ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే అక్కడే డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్ టికెట్ కోసం పోటీలో ఉన్నారు. ఇప్పుడు సీతమ్మ కూడా వస్తుందనే ప్రచారం ఉండడంతో టికెట్ ఆశిస్తున్న వారిలో ఆందోళన నెలకొంది. గద్వాలలో సైతం అసెంబ్లీ టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. కొల్లాపూర్, నాగర్‌కర్నూల్‌లో చేరికల చిచ్చు తారాస్థాయికి చేరగా, కొత్త, పాత నేతల మధ్య వైరం ముదిరింది. తాజా చేరికలతో మక్తల్, మహబూబ్‌నగర్, గద్వాల, దేవరకద్ర నియోజకవర్గాల్లో కొత్తగా చేరిన నేతలతో ఎవరికి ముప్పు నెలకొందనే అంశం హాట్‌టాపిక్‌గా మారింది.

క్లుప్తంగా

ప్రాణం తీసిన అతివేగం


శ్రీకాంత్ (ఫైల్)

అచ్చంపేట రూరల్: అతివేగం ఓ యువకుడి ప్రాణం తీసింది. రోడ్డు మూలమలుపు వద్ద బైక్ వేగాన్ని నియంత్రించలేక చెట్టును ఢీకొని దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పులిజాలకు చెందిన పాలుమూరి శ్రీకాంత్ (26) అచ్చంపేటలోని సాయినగర్ కాలనీలో నివాసముంటున్నాడు. మంగళవారం బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా, మార్గమధ్యంలోని మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఏడాది కిందటే వివాహమైందని, గర్భవతిగా ఉన్న భార్య సాత్వికకు రెండు రోజుల కిందట సీమంతం నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి

ఊర్కొండ: వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేస్తూ ప్రమాదవశాత్తు ఓ వలస కూలీ మృతిచెందాడు. వివరాలిలా.. మండలంలోని రాచాలపల్లికి చెందిన రైతు విక్రమ్‌రెడ్డి పొలంలో వ్యవసాయ కూలీ నిమిత్తం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రోషన్(22) కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజు వైరు సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లెనిన్ చెప్పారు.

చోరీకి వెళ్లి.. బావిలో పడి..


జక్కనీ శివ(ఫైల్)

కొత్తకోట రూరల్: కరెంట్ మోటార్ తీగను చోరీ చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్లలో చోటుచేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మోజర్లకి చెందిన జక్కనీ శివ(22), శ్రీను ఇద్దరు స్నేహితులు. వీరిద్దరూ కలిసి కొంత కాలంగా పేయింటింగ్ పని చేస్తుండేవారు. ఈ నెల 10న పేయింటింగ్ పని ఉందని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన జక్కనీ శివ మరుసటి రోజు వరకు ఇంటికి రాలేదు. దీంతో భయాందోళన చెందిన తండ్రి శాంతన్న పెద్దమందడి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు శివ వెంట వెళ్లిన శ్రీనును విచారించారు. మోజర్లకు చెందిన ఓ రైతు వ్యవసాయ బావికి బిగించిన బోరు కరెంట్ తీగను చోరీ చేసేందుకు వెళ్లగా.. శివ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు శ్రీను పోలీసులకు వివరించాడు. దీంతో మంగళవారం పోలీసులు బావి వద్దకు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

ఆర్థిక సమస్యలతో యువకుడి ఆత్మహత్య


వెంకటేష్ (ఫైల్)

మన్ననూర్: ఆర్థిక సమస్యలతో సారాకు బానిసైన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్లమలలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. అమ్రాబాద్ మండలం కుడిచింతలబైలుకు చెందిన పెర్ముల వెంకటేష్ (38) కొన్నేళ్లుగా ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో సారాకు బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి ఇంటికి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఆటోలో ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య లాలమ్మ, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు.

లారీ ఢీకొని చిన్నారికి గాయాలు

కోస్గి: తల్లిదండ్రులతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ చిన్నారి రోడ్డు ప్రమాదానికి గురై గాయపడిన ఘటన మండలంలోని చంద్రవంచ గ్రామశివారులో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా యాలాల్ మండలానికి చెందిన సాయిలు, హేమ దంపతుల కూతురు శ్రావ్యకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ద్విచక్ర వాహనంపై కోస్గికి వచ్చి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. ఇక్కడి నుంచి స్వగ్రామానికి తిరిగి వెళ్తున్న క్రమంలో చంద్రవంచ శివారులో రావులపల్లికి చెందిన లారీ వెనుకనుంచి బైక్‌ను ఢీకొట్టింది. తల్లిదండ్రులు రోడ్డుపక్కన పడిపోగా, చిన్నారి లారీ కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

అటకెక్కిన బైపాస్ ప్రతిపాదనలు

- ప్రత్యామ్నాయ రహదారులపై దృష్టిసారించని అధికారులు
- 167వ నంబర్ జాతీయ రహదారిపై కొనసాగుతున్న పనులు
- మరో వైపు రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు


సిగ్నల్‌గడ్డపై ట్రాఫిక్ జాం

జడ్చర్ల టౌన్: దిన దినాభివృద్ధి జరుగుతున్న జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు గానూ ప్రతిపాదించిన బైపాస్ రోడ్డు ప్రతిపాదనలు అటకెక్కాయి. భవిష్యత్‌లోనూ నిర్మాణం చేపట్టే అవకాశాలు కనిపించటం లేదు. బైపాస్ ప్రతిపాదనలు అటకెక్కినప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారులు దృష్టి సారించకపోవటం ఆందోళన కలిగిస్తుంది. నియోజకవర్గ కేంద్రం మీదుగా 167వ నంబరు జాతీయ రహదారి వెళ్తుంది. రాయిచూర్ నుంచి కోదాడ వరకు రోడ్డు విస్తరణలో భాగంగా ఇటీవలే సిగ్నల్‌గడ్డ వద్ద 750 మీటర్ల మేర పనులు ప్రారంభమయ్యాయి. ముందుగా కల్వకుర్తి రోడ్‌వైపు కాల్వ నిర్మాణం, మెయింటెన్స్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభించారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక హైస్కూల్ వైపు రోడ్డు గుంతలమయంగా మారి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఈ కారణంగా ఎల్ఐసీ కార్యాలయం నుంచి డిగ్రీ కళాశాల మహిళా హాస్టల్ వరకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. రాయిచూర్ నుంచి వచ్చే వాహనాలు కోదాడ వరకు ఇదే మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది. దీంతో నిత్యం వాహనదారులు, పట్టణవాసులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిర్మాణంలోనే ఆర్‌యూబీ..

నియోజకవర్గ కేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా ఆ మార్గంలోనూ రాకపోకలు నిలిపివేశారు. దీంతో వాహనాలు అన్ని సిగ్నల్‌గడ్డపై నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తుంది. గౌడపంక్షన్‌హాల్ పక్క నుంచి ద్విచక్రవాహనాలు, కార్లు వెళ్లేందుకు మాత్రమే అవకాశం ఉంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.

ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం..

2017లో స్థానిక ఎమ్మెల్యే వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా కొనసాగుతున్న సమయంలో రోడ్లు భవనాల శాఖ ద్వారా బైపాస్ ప్రతిపాదనలు తీసుకొచ్చారు. 44వ నంబరు జాతీయ రహదారి దివిటిపల్లి నుంచి తాటిపర్తి మీదుగా మండలంలోని ఆలూరు ద్వారా బూర్గుపల్లి చేరుకుని జడ్చర్ల- నాగర్‌కర్నూల్ రోడ్‌ను కలిపేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకోసం రోడ్లు భవనాల శాఖ అధికారులు సర్వేను సైతం నిర్వహించారు. బైపాస్‌తో నియోజకవర్గ కేంద్రం నుంచి వెళ్లే వాహనాల సంఖ్య తగ్గుతుందని అంచనా వేశారు. అయితే ఆ ప్రతిపాదనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి.

దృష్టి సారించని అధికారులు..

నియోజకవర్గ కేంద్రం మున్సిపాలిటీలో ప్రత్యామ్నాయ మార్గాల వైపు అధికారులు దృష్టిసారించటం లేదు. 167వ నంబరు జాతీయ రహదారి సిగ్నల్‌గడ్డపై ఏదైనా ప్రమాదం జరిగితే రాయిచూరు–కోదాడ రాకపోకలు నిలిచిపోతాయి. బైపాస్ నిర్మాణం లేకపోవటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రోడ్డు పనులు కొనసాగుతున్నందున ట్రాఫిక్ సమస్య కారణంగా ఈ మార్గంలో వచ్చేందుకు వాహనదారులు జంకుతున్నారు. జడ్చర్ల క్రాస్‌రోడ్డు నుంచి వెంకటేశ్వరస్వామి దేవాలయం పక్క నుంచి, బాలానగర్‌ల నుంచి రైల్వే వంతెన కింది నుంచి గంగాపురం రోడ్ చేరుకునేలా మార్గం వేయాల్సి ఉంది. యుద్ధప్రాతిపదికన ఈ మార్గంలో బీటీవేసి రాకపోకలు సాగిస్తే పట్టణంలో కొంతమేర ట్రాఫిక్ సమస్య తగ్గే అవకాశాలు ఉన్నాయి. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించాల్సి ఉంది.

ప్రత్యామ్నాయ మార్గాలు చూడాల్సి ఉంది

నియోజకవర్గ కేంద్రం, మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు క్రాస్‌రోడ్డు నుంచి సిగ్నల్‌గడ్డకు రాకుండా వెంకటేశ్వరస్వామి దేవాలయం పక్క నుంచి వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. రోడ్డుపై ఇటీవలే కొంత మొరం వేయించి చదును చేయించాం. వాహనాలు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటాం. అయితే భారీ వాహనాలు మాత్రం రైల్వే లైన్ కింది నుంచి వెళ్లేందుకు వీలుకానందున సిగ్నల్‌గడ్డ నుంచి వెళ్తున్నాయి. మరిన్ని ప్రత్యామ్నాయ మార్గాలపై రోడ్లు భవనాల శాఖ అధికారులతో కలిసి చర్చిస్తాం.

– మహమూద్‌షేక్, కమిషనర్, మున్సిపాలిటీ, జడ్చర్ల

కమ్యూనిటీహాల్ వివాదంపై విచారణ


విచారణ నిర్వహిస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారిణి ఉమాదేవి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని గంగాపురం రోడ్‌లో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి మఠం కమ్యూనిటీహాల్ వివాదంపై మంగళవారం బీసీ వెల్ఫేర్ అధికారిణి ఉమాదేవి విచారణ చేపట్టారు. ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌లో కొందరు అక్రమంగా నివాసముంటున్నారని, వారిని అక్కడి నుంచి పంపించాలని పట్టణానికి చెందిన విశ్వకర్మ మనుమయ సంఘం, బీసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇటీవల ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బీసీ వెల్ఫేర్ అధికారి ఉమాదేవి కమ్యూనిటీ హాల్ వద్దకు చేరుకొని ఇరువర్గాల నుంచి వివరాలను సేకరించారు. అన్ని పత్రాలను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని ఆమె తెలిపారు. ప్రజాప్రతినిధుల నిధులతో కమ్యూనిటీహాల్ నిర్మించినట్లయితే, స్వాధీనం చేసుకుని సంఘానికి అప్పగిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు వడ్ల శేఖర్, భాస్కరాచారి, కొంగళి నాగరాజు, నడిమింటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సోలార్ ప్రాజెక్టు వద్ద పటిష్ట బందోబస్తు


గట్టు సోలార్ ప్రాజెక్టు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

గట్టు: మండల కేంద్రంలోని సోలార్ ప్రాజెక్టు వద్ద మంగళవారం పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ధరూరు సమీపంలో సోమవారం సోలార్ ప్రాజెక్ట్‌కు చెందిన వాహనం ఢీకొని మండల కేంద్రంలోని దళితవాడకు చెందిన సాగర్ (19) మృతి చెందగా, మరో యువకుడు గాయపడిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ క్రమంలో గద్వాల మార్చురీలో మంగళవారం సాగర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించడంతో స్వగ్రామానికి తీసుకొచ్చారు. పరిహారం కోసం మృతుడి కుటుంబ సభ్యులు సోలార్ ప్రాజెక్టు వద్ద ఆందోళన నిర్వహించే అవకాశం ఉన్నందున ఎస్ఐలు నందికర్, శివానందం, వెంకటేష్‌ల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కారుకు నిప్పు


పాక్షికంగా కాలిపోయిన కారు

ఊట్కూర్: ఇంటి ఆవరణలో నిలిపిన కారుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టిన ఘటన మండల కేంద్రంలోని శ్రీకృష్ణనగర్ చౌరస్తాలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శ్రీకృష్ణనగర్ చౌరస్తాకు చెందిన బుద్ది విఠోబా రోజు మాదిరిగానే ఇంటి ఆవరణలో కారును నిలిపారు. తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కారుపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. గమనించిన విఠోబా తల్లి యశోదమ్మ కేకలు వేయడంతో కుటుంబ సభ్యులతోపాటు చుట్టుపక్కల వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే కారు పాక్షికంగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

టూడే లీగ్ మ్యాచ్‌లో పాలమూరు విజయం


ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన హెచ్‌సీఏ టూడే లీగ్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు విజయం సాధించింది. మొదట ఉస్మానియా యూనివర్సిటీ జట్టు బ్యాటింగ్ చేయగా.. జిల్లా బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయింది. 45.1 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా ఆల్ రౌండర్ డేవిడ్ క్రిపాల్ మెరుగైన బౌలింగ్ చేశాడు. 8 ఓవర్లలో మూడు మెయిడిన్లు వేసి, ఐదు వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు.. 17.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులో హర్షవర్ధన్ 41, ఎ.శ్రీకాంత్ 26 పరుగులు చేశారు. హెచ్‌సీఏ టూడే లీగ్ మ్యాచ్‌లో ఉమ్మడి జిల్లా జట్టు విజయం సాధించడంపై ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో టూడే లీగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన బొలెరో

- ఆరుగురికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన మహిళ

కొత్తకోట రూరల్: ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను బొలెరో వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ఆరుగురికి గాయాలైన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు.. పెద్దమందడి మండలం వెల్టూర్ నుంచి ప్రయాణికులతో కొత్తకోటకు వస్తున్న ఆటోను బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నక్క నాగమ్మ, లక్ష్మమ్మ, బీరమ్మ, నాగమ్మ, బాంబె రాములు, లక్ష్మమ్మకు గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంట్లో చోరీ

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని సాయినగర్ కాలనీలో గుర్తుతెలియని దుండగులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. పట్టణ ఎస్ఐ యుగంధర్‌రెడ్డి కథనం మేరకు.. సాయినగర్ కాలనీకి చెందిన జంగిడి సురేష్ సోమవారం ఇంటికి తాళం వేసి భార్యాపిల్లలతో కలిసి పెద్దగుడెం శివారులో ఉన్న కోళ్ల షెడ్ వద్దకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి రాగా, వంటగది తలుపులకు గడియ లేకుండా కనిపించింది. తామే మరిచిపోయి ఉంటామని అనుకున్నారు. మంగళవారం ఇంటిని శుభ్రం చేస్తుండగా బీరువా వద్ద పర్సు కనిపించింది. అనుమానం వచ్చి బీరువాను తెరిచి చూడగా, 3తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి గొలుసులు కనిపించలేదు. సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వర్క్‌ఫ్రం హోం పేరుతో బురిడీ

జడ్చర్ల: ఆన్‌లైన్‌లో వర్క్‌ఫ్రం హోం పేరుతో యువకుడిని బురిడీ కొట్టించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సీఐ రమేష్‌బాబు కథనం మేరకు.. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఎస్‌పీ చరణ్‌కు ఆగస్టు 23న గూగుల్ మ్యాప్స్‌లో వ్యూస్ రాస్తే డబ్బులు వస్తాయని 8109513125 నంబర్ నుంచి వాట్సాప్ మెసేజ్ పంపారు. దీనిపై స్పందించిన అతడు.. వ్యూస్ పంపగా, కొంత డబ్బులు వచ్చాయి. ఆ తర్వాత టెలిగ్రాం గ్రూప్‌లో బాధితుడి నంబర్ యాడ్ చేశారు. డబ్బులు రావాలంటే టాస్క్‌లు పూర్తి చేయాలని, డబ్బులు రెట్టింపు అవుతాయని నమ్మబలికారు. దీంతో మూడు విడతలుగా దాదాపు రూ.93వేలు పంపించాడు. డబ్బులు రెట్టింపు కాకపోవటంతో తాను చెల్లించిన మొత్తం వాపస్ ఇవ్వాలని గ్రూప్‌లో కోరగా, అందుకు పన్ను చెల్లించాలని తెలియజేశారు. దీంతో బాధితుడు మరో రూ.55వేలు చెల్లించాడు. అయినప్పటికీ డబ్బులు రాకపోవడంతో తాను మోసపోయానని గుర్తించి జడ్చర్ల పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

వాట్సాప్ అంతరాయం లేకుండా చేస్తామని..

వాట్సాప్ అంతరాయం ఏర్పడకుండా చేస్తామని నమ్మబలికి రూ.50వేలు స్వాహా చేసిన ఘటన జడ్చర్లలో చోటుచేసుకుంది. స్థానిక బాలాజీనగర్‌కు చెందిన మమతకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి వాట్సాప్‌లో అంతరాయం ఏర్పడకుండా సరి చేస్తామని, ఇందుకు కేవలం రూ.5 సర్‌చార్జీ చెల్లించాలని నమ్మబలికాడు. దీంతో ఆమె తన బ్యాంకు ఖాతా నుంచి రూ.5 చెల్లించగా, వెంటనే ఆమె ఖాతా నుంచి రూ.50వేలను తస్కరించారు. బాధితురాలి భర్త రాము స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించడానికి సిద్ధం

- తిరగబడదాం– తరిమికొడదాంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్


కరపత్రాలు చూపుతున్న సంపత్‌కుమార్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: బీఆర్‌ఎస్, బీజేపీలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయని, ఈ పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మోటార్‌లైన్‌లో మంగళవారం 'తిరగబడదాం– తరిమికొడదాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ పలువురు నాయకులతో కలిసి పలు ఇళ్ల గోడలకు అతికించి.. ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం విలేకరులతో సంపత్‌కుమార్ మాట్లాడుతూ టీపీసీసీ చార్జ్‌షీట్ అమలు పరిచే కమిటీ చైర్మన్‌గా తనను నియామకం చేసినందుకు ఏఐసీసీకి కృతజ్ఞతలు తెలిపారు. తిరగబడదాం– తిరిమికొడదాం కార్యక్రమం ద్వారా ప్రతి గడపకు వెళ్లి బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కేసీఆర్, మోదీలకు హఠావ్ తెలంగాణ, దేశ్‌కో బచావ్ నినాదంతో ముందుకు వెళ్తామన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, అన్నివర్గాల సంక్షేమానికి పాటుపడతామన్నారు. దక్షిణ తెలంగాణ పట్ల ప్రభుత్వం తీవ్ర వివక్షత చూపుతుందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ.లక్ష కోట్లతో పూర్తి చేసిన ప్రభుత్వం పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. పాలమూరు ప్రాజెక్టు 40 శాతం కూడా పూర్తికాలేదని, కేవలం ఒక్క మోటార్‌నే ప్రారంభిస్తున్నారని, జిల్లా ప్రజలకు సీఎం కేసీఆర్ సమాధానం చెప్పి రావాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, ఎన్పీ వెంకటేశ్, సీజే బెనహర్, రాధ, వసంత, అనిత, ప్రశాంత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్‌అలీ, అబ్దుల్ హక్, అవేజ్, రాములుయాదవ్, చంద్రశేఖర్, అజీజ్ పాల్గొన్నారు.

4 యూనిట్లలో విద్యుదుత్పత్తి



దిగువ జూరాలలోని స్విచ్‌యార్డు కేంద్రం

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులోని ఎగువ, దిగువ జెన్‌కో జల విద్యుత్‌కేంద్రంలో నాలుగు యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. ఎగువలో 2 యూనిట్ల ద్వారా 78 మెగావాట్లు, 82.579 మిలియన్ యూనిట్లు ఎంయూ, దిగువలో 2 యూనిట్ల ద్వారా 80 మెగావాట్లు, 88.970 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. కాగా.. ప్రాజెక్టుకు మంగళవారం సాయంత్రం 12వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన గుడ్డెందొడ్డి లిఫ్టు–1 వద్ద ఒక పంపు ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 11,363 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 117 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 640 క్యూసెక్కులు, కుడి కాల్వకు 596 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 60 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 13,466 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.173 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా 113.107 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి ఇన్‌ఫ్లోలు లేవని... ప్రాజెక్టు నుంచి 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా. ప్రస్తుతం 25.77 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 9,796క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా...ఎలాంటి ఔట్‌ఫ్లో లేదు.

శ్రీశైలంలో 855.1 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం 855.1 అడుగుల వద్ద 92.0480 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ.. 11,363 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 2,000, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,454, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 1,192 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయంలో 231 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

ఎల్లూరు సర్జ్‌పూల్‌లోకి కృష్ణాజలాలు


సర్జ్‌పూల్‌లోకి విడుదల అవుతున్న కృష్ణాజలాలు

కొల్లాపూర్ రూరల్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఎల్లూరు గ్రామశివారులో నిర్మించిన సర్జ్‌పూల్‌లోకి మంగళవారం కృష్ణాజలాలను విడుదల చేశారు. ఎత్తిపోతల పథకంలో రెండు పంపుల నిర్మాణ పనులు పూర్తి కావడంతో సంబంధిత అధికారులు ఇంటేక్‌వెల్ ద్వారా సర్జ్‌పూల్‌లోకి కృష్ణాజలాలను వదిలారు. 16న ఒక షెటర్ ఎత్తి పంప్‌హౌజ్‌లోకి నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

కశ్మీర్ టు కన్యాకుమారి

- సేవ్ సాయిల్, గో ఆర్గానిక్‌పై సైకిల్ యాత్ర


సైకిల్ యాత్ర చేపట్టిన ఉమేష్‌కుమార్, సచిన్ నికమ్

అడ్డాకుల: సేవ్ సాయిల్, గో ఆర్గానిక్‌పై మహారాష్ట్రకు చెందిన ఇద్దరు మిత్రులు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. వీరి యాత్ర మంగళవారం అడ్డాకులకు చేరింది. మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లా పలూస్‌కు చెందిన ఆయుర్వేద వైద్యుడు ఉమేష్‌కుమార్ పాటిల్, సైకిల్ షోరూం నిర్వాహకుడు సచిన్ నికమ్ 3,600 కిలోమీటర్ల సైకిల్ యాత్రకు ఆగస్టు 27న జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ లాల్‌చౌక్‌లో శ్రీకారం చుట్టారు. ఇద్దరు కలిసి సేవ్ సాయిల్, గో ఆర్గానిక్‌పై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు అందరూ కృషి చేయాలని కోరుతున్నారు. శ్రీనగర్ నుంచి మొదలైన సైకిల్ యాత్ర హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర మీదుగా తెలంగాణలో సైకిల్ యాత్ర సాగుతోంది. తర్వాత ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మీదుగా తమిళనాడు రాష్ట్రంలోని కన్యాకుమారికి చేరుకుంటుందని సైకిల్ యాత్రికులు తెలిపారు. రోజూ 140 నుంచి 150 కి.మీ. సైకిల్ యాత్ర చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 2,600 కి.మీ. యాత్ర పూర్తయినట్లు చెప్పారు. 2019లో మహారాష్ట్ర నుంచి కన్యాకుమారి వరకు 1400 కి.మీ. సైకిల్ యాత్ర చేసిన అనుభవంతోనే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఇప్పుడు యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఉప్పర్‌పల్లి శివారులో పులి సంచారం

మక్తల్: మండలంలోని ఉప్పర్‌పల్లి శివారులో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తోటలో ట్రాక్టర్‌తో చదును చేస్తున్నాడు. ఆ సమయంలో ట్రాక్టర్ శబ్దానికి పులి పరుగెత్తుకుంటూ వెళ్లింది. అయితే రైలు పట్టాల నుంచి ఉప్పర్‌పల్లి గ్రామ శివారులోకి వెళ్లిందా.. ఎడివెల్లి గ్రామాల వైపు వెళ్లిందా.. అనేవిషయం తెలియ డంలేదు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. మంగళవారం సాయంత్రం అటవీశాఖ అధికారులు గాలించినా.. పులి ఆచూకీ లభించలేదు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వెల్దండ: మండల కేంద్ర సమీపంలో ఈనెల 5న చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయపడిన మంగమ్మ (58) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మిడ్జిల్ మండలం వేములకు చెందిన మంగమ్మతోపాటు మరో ఇద్దరు మహిళలు మండల కేంద్రంలోని ఓ ఆస్పత్రికి వచ్చి వెళ్తుండగా, ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో మంగమ్మకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.